

పుష్పపల్లకిపై శివపుత్రుడి విహారం



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 21: కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో శనివారం రాత్రి స్వామివారు పుష్ప పల్లకిపై విహరించారు. ఈ కార్యక్రమానికి భాగ్యలక్ష్మీ, దివంగత మోహన్‌నాయుడు, వీటీ రాజన్ అండ్ బ్రదర్స్ రామనాథ నాయుడు, కీర్తిశేషులు రాజారెడ్డి జ్ఞాపకార్థం, కీర్తిశేషులు కృష్ణమ నాయుడు జ్ఞాపకార్థం వారి కుమారులు, నరసింహారెడ్డి అండ్ సన్స్ రాజారెడ్డి అండ్ కో, కీర్తిశేషులు శ్రీరాములరెడ్డి, బాలకృష్ణారెడ్డి, శేషయ్య నాయుడు అండ్ సన్స్ కుమరేంద్రచౌదరి, మనోహర్‌నాయుడు అండ్ బ్రదర్స్ ఆంజినేయులు నాయుడు అండ్ సన్స్ ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం మూలవిరాట్‌కు ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకం, చందనాలంకారాన్ని చేశాక భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి ఉభయదారులు ఉభయ వరస తీసుకురాగానే అలంకార మండపంలో స్వామివారి ఉత్సవర్లకు పూజలు చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామివారి ఉత్సవర్లను పుష్పపల్లకిపై ఆశీనులను చేసి, కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఈవో గురుప్రసాద్, ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగరరెడ్డి, రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి, ఉభయదారులు పాల్గొన్నారు. పుష్పపల్లకి సందర్భంగా ఆలయ ఆస్థాన మండపంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.పుష్పపల్లకి సేవను వీక్షించడానికి రాష్ట్రంనుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటకల నుంచి కూడా వేలాదిగా భక్తులు కాణిపాకం క్షేత్రానికి విచ్చేశారు.స్వామి దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది.ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా కాణిపాకంలో కామధేను వాహన సేవను ఆదివారం నిర్వహించనున్నారు.

స్వర్ణ రథంపై వరసిద్ధుడి వైభోగం

కాణిపాకంలో శనివారం సంకటహర గణపతి వ్రతాన్ని ఆలయ అధికారులు కల్యాణ వేదిక వద్ద నిర్వహించారు. ఉదయం మూల విరాట్‌కు అభిషేకం చేశాక సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవర్లను ఆస్థాన మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం భక్తుల ఆధ్వర్యంలో వ్రతాన్ని నిర్వహించారు. రాత్రి సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవర్లను స్వర్ణరథంపై ఉంచి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. స్వర్ణరథంపై స్వామిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో, సూపరింటెండెంట్లు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



● కొత్త మలుపు తిరిగిన ఆదిమూలం కేసు

ఓను.... వాళ్ళిద్దరూ రాజీపడ్డారు!

సత్యవేడు, సెప్టెంబరు 21: లైంగిక వేధింపుల ఆరోపణలతో సస్పెండైన టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కేసు కొత్త మలుపు తిరిగింది. తనను ఎమ్మెల్యే ఆదిమూలం పలుమార్లు లైంగిక వేధింపులకు గురిచేసి,అత్యాచారానికి పాల్పడ్డారని అందుకు సంబంధించిన వీడియో టేపులను మీడియాకు విడుదల చేసి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన కేవీబీపురం మండలానికి చెందిన బాధిత మహిళ చివరకు ఆయనతో రాజీ పడినట్లు సమాచారం.తనను ఎమ్మెల్యే ఆదిమూలం లైంగికంగా వేధించాడని తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టిన ఆమె శుక్రవారం హైకోర్టుకు హాజరై ఎమ్మెల్యేపై తాను పెట్టిన కేసు, అందులో పేర్కొన్న ఆరోపణలు అవాస్తవమని నివేదించడం గమనార్హం. తనపై నమోదైన కేసును కొట్టి వేయాలని ఆదిమూలం హైకోర్టును ఆశ్రయించగా ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఆదిమూలం తరఫున సీనియర్ న్యాయవాది సి.రఘు వాదనలు వినిపించారు.ఆదిమూలంపై పోలీసులు పెట్టిన కేసులో సెక్షన్లు వర్తించవని, మహిళా పోలీసు అధికారిణి నమోదు చేయాల్సిన కేసును పురుష పోలీసు అధికారి నమోదు చేశారని,జూలై, ఆగస్టునెలల్లో సంఘటన జరిగితే సెప్టెంబరు 5న కేసు నమోదు చేశారని ఆయన కోర్టుకు వివరించారు. ఇదిలా ఉండగా మూడవ వ్యక్తి ప్రమేయంతోనే మహిళ కేసు పెట్టిందని,ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని కేసును కొట్టి వేయాలని కోరారు. మరోవైపు బాధిత మహిళ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో అంశాలన్నీ అవాస్తవమని, ఈ మేరకు నోటరీతో కూడిన అఫిడవిట్‌ను బాధిత మహిళ కోర్టుకు సమర్పించిందని, అందువల్ల ఈ కేసును కొట్టి వేయాలని మహిళ తరఫు న్యాయవాది జితేందర్ సైతం కోర్టులో వాదనలు వినిపించారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృష్ణసాగర్ తీర్పును ఈ నెల 25వ తేదీకి రిజర్వ్ చేశారు. అంతవరకు ఈ కేసులో ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు. సంచలనం కలిగించిన ఈ కేసులో బాధిత మహిళ యూటర్న్ తీసుకుని ఎమ్మెల్యేతో రాజీ కుదుర్చుకోవడం వెనుక నియోజకవర్గంలో అనేక ప్రచారాలు జరుగుతున్నాయి. రాజీ కుదిర్చేందుకు ఐదు రోజులుగా విజయవాడలో సుదీర్ఘ మంతనాలు జరిగినట్లు సమాచారం.

సస్పెన్షన్ ఎత్తివేతపై చర్చ

ఎమ్మెల్యే ఆదిమూలంపై టీడీపీ అధిష్ఠానం వేసిన సస్పెన్షన్ వేటు ఉంటుందా కొనసాగుతుందా అన్న చర్చ జిల్లాలో జోరుగా సాగుతోంది. ఈ నెల 5న ఆదిమూలంపై లైంగిక ఆరోపణల నేపథ్యంలో ఏబీఎన్‌లో ప్రసారమైన వార్తలను పరిగణనలోకి తీసుకున్న చంద్రబాబు ఆదేశాలతో గంటల వ్యవధిలోనే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు సస్పెన్షన్‌కు ఆదేశాలు జారీ చేశారు. విజయవాడలో వరద సహాయక చర్యల్లో రాత్రింబవళ్ళు నిమగ్నమైన చంద్రబాబు, ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని సస్పెన్షన్‌కు చర్యలు తీసుకున్నారు. టీడీపీలో ఇలాంటి క్రమశిక్షణరాహిత్య చర్యలకు తావుండదని సస్పెన్షన్‌తో పార్టీ క్యాడర్‌ను పరోక్షంగా హెచ్చరించారు. అయితే ప్రస్తుతం ఆదిమూలం కేసు కోర్టులో వీగిపోతే ఆయన సస్పెన్షన్‌ను తొలగిస్తారా లేదా అన్నది వేచి చూడాల్సిందే.

ఎమ్మెల్యేల పల్లెబాట

● 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



గొబ్బిళ్లకోటూరులో బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్న అమరనాథరెడ్డి

చిత్తూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లావ్యాప్తంగా ప్రజావేదికలను నిర్వహించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు శుక్రవారం ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యేలు ఏడు రోజుల పాటు నిర్వహించనున్నారు. అందులో భాగంగా రెండో రోజు శనివారం ఎమ్మెల్యేలు, అధికారులు గ్రామాల బాట పట్టారు. ప్రజావేదికలను నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన మంచి, అమలు చేసిన హామీల గురించి ప్రజలకు వివరించారు. ఇంటింటికీ వెళ్లి 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలను పంపిణీ చేశారు.

●వి.కోట మండలం కుంబార్లపల్లెలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం మిడేళ్లపల్లె, కుమ్మార్లపల్లెల్లో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. వి.కోట మండలంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరై వైసీపీ హయాంలో ఆగిపోయిన గ్రామీణ రహదారులు, కోల్డ్ స్టోరేజ్ వంటి అభివృద్ధి పనుల్ని మళ్లీ ప్రారంభిస్తానన్నారు.

●గుడిపాల మండలం పాపసముద్రం పంచాయతీలోని పిల్లారికుప్పంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలన గురించి ప్రజలకు వివరించారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



పిల్లారికుప్పం సమావేశంలో ప్రసంగిస్తున్న జగన్మోహన్

●జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ ఎస్‌ఆర్‌పురం మండలంలోని నెలవాయి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొన్న యుగంధర్‌తో కలిసి పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన మంచి గురించి వివరించారు.

● రొంపిచెర్ల మండలం మోటుమల్లెల గ్రామంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. గ్రామస్థుల నుంచి వినతులను స్వీకరించారు. దాసరగూడెం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలను పంపిణీ చేశారు.

● కుప్పం మున్సిపాలిటీలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు పీఎస్ మునిరత్నం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నగరి మున్సిపాలిటీ పరిధిలోని 2, 3, 4 వార్డుల్లో స్థానిక టీడీపీ నాయకులు, అధికారులు కలిసి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వంద రోజుల్లో చేసిన మంచి వివరిస్తూ ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు.

ఆగ్రహావేశాలు

● శ్రీవారి లడ్డూ కల్తీపై నేతల ఆందోళనలు

శ్రీవారి భక్తులు పవిత్ర ప్రసాదంగా భావించే లడ్డూను అపవిత్రం చేశారంటూ తిరుపతిలో శనివారం ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు ఆందోళనలు చేపట్టారు.హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నినదించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ , టీటీడీ మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. వారిని అరెస్టు చేయాలని బీజేపీ నేతలు, జనసేన నేతలు ఎస్పీ సుబ్బరాయుడికి వినతిపత్రాలు అందజేశారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



బీజేపీ నిరసన

● జగన్,వైవీ,భూమన దిష్టిబొమ్మల దహనం

సీబీఐ విచారణ చేయాలి

పవిత్రమైన లడ్డూను అపవిత్రం చేసిన అంశంపై సీబీఐతో విచారణ జరిపించి, దోషులను శిక్షించాలి. రీటెండరింగ్ విధానంతో రూ.320కే కిలో నెయ్యి కొన్నామని ప్రగల్భాలు పలికిన జగన్మోహన్‌రెడ్డి, ధర్మారెడ్డి ఇప్పుడు సమాధానం చెప్పాలి. గత ఐదేళ్లలో నిత్యం కొండపై శిలువ గుర్తులు, కాఫీ కప్పులు, గంజాయి అమ్మకాలు సాగాయి. జే బ్రాండ్ మద్యం తరహాలో జగన్ బ్రాండ్ నెయ్యి తెచ్చారు.

- సుగుణమ్మ, మాజీ ఎమ్మెల్యే

దోషులు తప్పించుకోలేరు

కలియుగ దైవం వెంకన్న దృష్టి నుంచి దోషులెవరూ తప్పించుకోలేరు. తిరుమలలో ఏమీ జరగలేదని, చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారని జగన్‌రెడ్డి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుంది. శ్రీవాణి ట్రస్టు నిధులు మాయం, అగ్నిప్రమాదంలో కొన్ని ఫైళ్లు దగ్ధం కావడం నిజం కాదా? కల్తీ నెయ్యి విషయమై శ్రీవారి భక్తుల్లో అలజడి రేపిన ఘనత జగన్‌రెడ్డికి దక్కింది.

- నరసింహయాదవ్, టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు

కల్తీ నెయ్యిపై దర్యాప్తు చేపట్టాలి

శ్రీవారి లడ్డూల్లో వినియోగించిన కల్తీ నెయ్యి అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర దర్యాప్తు చేపట్టాలి. నెయ్యిలో కల్తీ జరగడంతో హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయి. గత ప్రభుత్వంలో శ్రీవారి పరకామణిలో జరిగిన దోపిడీ గురించి కూడా విచారణ చేయమని గతంలోనే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం. ఈ కుట్రలో అప్పటి ఈవో ధర్మారెడ్డి, ఛైర్మన్ కరుణాకర రెడ్డి, విజిలెన్స్, పోలీసు అధికారులు ఉన్నారు. ఈ విషయాన్ని ఇటీవల జరిగిన శాసనమండలి సమావేశంలోనూ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చాం.

- తిరుమలలో ఎమ్మెల్సీలు రాంగోపాల్‌రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర



జనసేన నిరసన

అఖండ దీపానికీ అదే నెయ్యి వాడారా?

'కల్తీ నెయ్యిని లడ్డూ ప్రసాదాల్లో వినియోగించడమే కాకుండా శ్రీవారి మూలవిరాట్ ముందు అఖండ దీపానికి వినియోగించి ఉంటే దానిపైనా విచారణ జరగాలి. బాధ్యులను కఠినంగా శిక్షించాలి' అని కూటమి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు , పులివర్తి నాని, మురళీ మోహన్ , గురజాల జగన్మోహన్ డిమాండు చేశారు.. హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.శనివారం తిరుపతిలో వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. లడ్డూ నాణ్యత తగ్గిందని పవన్ కల్యాణ్ గతంలోనే చెప్పారని జంగాలపల్లి శ్రీనివాసులు అన్నారు. అన్యమతస్తులు కొండపై చేరి సర్వనాశనం చేశారని, అయితే దేవుడి శిక్షనుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు.



స్వయం ప్రకటిత మేధావి కరుణాకర రెడ్డి ఏమీ ఎరగనట్టు ఏదేదో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.తిరుమలను కూడా వైసీపీ వారు సొంత అవసరాలకు వాడుకున్నారని పులివర్తి నాని ఆరోపించారు. ఈ వ్యవహారంలో జగన్‌కు అత్యంత సన్నిహితుడు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి ప్రమేయమూ ఉందని ఆరోపించారు. ఆల్ఫా కంపెనీకి 2లక్షల లీటర్ల ఉత్పత్తి సామర్థ్యం లేకపోయినా కాంట్రాక్టు ఇచ్చారంటే కమీషన్లకు కక్కుర్తిపడే ఆ పనిచేశారని ఎవరికైనా అర్థమైపోతుందన్నారు. ఆధ్యాత్మికతను వంటినిండా పులుముకుని కనిపించే చెవిరెడ్డి ఇప్పుడు ఎక్కడికి పోయారో తెలియడంలేదన్నారు.తిరుమలలో అపచారం జరిగిందని నిరూపిస్తే డైవర్షన్ రాజకీయాలంటారా? వైసీపీవే వక్ర బుద్ధి రాజకీయాలని మురళీ మోహన్ విమర్శించారు. ఆలయాన్ని వైసీపీ కార్యాలయం లాగా మార్చుకున్నారని పేర్కొన్నారు. లడ్డూ కల్తీపై చర్చకు, ప్రమాణానికి సిద్ధమా అని నారా లోకేశ్ సవాల్ విసిరితే తప్పు చేయకపోతే కోర్టును ఎందుకు ఆశ్రయిస్తున్నారని ప్రశ్నించారు. రివర్స్ టెండరింగ్ పేరుతో టీటీడీని కూడా వైసీపీ నేతలు భ్రష్టుపట్టించారని గురజాల జగన్మోహన్ అన్నారు. కమీషన్ల కోసం కక్కుర్తిపడి ప్రసాదాన్ని కలుషితం చేశారని దుయ్యబట్టారు. తప్పుచేసిన వ్యక్తులు ఏ స్థాయిలో ఉన్నా వదిలే ప్రసక్తే లేదన్నారు.

దేవుడితో చంద్రబాబు రాజకీయం : రోజా

నగరి, సెప్టెంబరు 21 : దేవుడితో రాజకీయం చేసే ఘనుడు చంద్రబాబు అని వైసీపీ అధికార ప్రతినిధి రోజా శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. శ్రీవారి ప్రసాదం గురించి తన మాటలు భక్తుల మనోభావాలను ఎంత దెబ్బతీస్తాయో ఆయన ఆలోచించక పోవడం శోచనీయమన్నారు.తన వందరోజుల పాలనలో ఏ హామీ నెరవేర్చక ప్రజల దృష్టిని మార్చడానికి తిరుమల లడ్డూల అంశాన్ని రాజకీయం చేస్తున్నారన్నారు.

చిత్తూరు- తచ్చూరు బైపాస్‌కి సర్వీసు రోడ్డుకోసం..!

నేడు సీపీఐ నారాయణ ఆధ్వర్యంలో వంటావార్పు కార్యక్రమం

నగరి, సెప్టెంబరు 21: చిత్తూరు- తచ్చూరు జాతీయ రహదారికి సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలంటూ సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆధ్వర్యంలో ఆదివారం వంటావార్పు చేపట్టనున్నారు. ఈ మేరకు నగరి నియోజకవర్గ సీపీఐ ప్రదాన కార్యదర్శి కోదండయ్య తెలిపారు. నింద్ర మండలం పాదిరి, నగరి మండలం అయనంబాకం గ్రామాల రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

పాము కాటుతో మహిళ మృతి


శాంతకుమారి (ఫైల్ ఫొటో)

నింద్ర, సెప్టెంబరు 21: పాముకాటుతో ఎస్.శాంతకుమారి(42) మృతి చెందారు. ఈ సంఘటన నింద్ర మండలం ఎలకాటూరు పంచాయతీ మిట్టూరు గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. భర్త మృతి చెందడంతో ఇద్దరు పిల్లల పోషణకోసం శాంతకుమారి పశువులను మేపుతోంది. రోజులాగానే శుక్రవారం కూడా పశువులను గ్రామ సమీపంలో పంటపొలాల వద్ద మేపుకుని తిరిగి వస్తుండగా పాము కాటు వేసింది. ఇంటికి వచ్చాక స్పృహ కోల్పోయింది. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈమె కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రేపు కుప్పానికి మంత్రి నిమ్మల రాక

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 21: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సోమవారం కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తారని కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న ఉదయం 11 గంటలకు మంత్రి కుప్పం బ్రాంచ్‌కెనాల్ టేకాఫ్ పాయింట్, కే-1 పంపింగ్ హౌస్‌లను తనిఖీ చేస్తారు. మధ్యాహ్నం రెండు గంటలకు కుప్పం ఆర్‌అండ్‌బీ అతిథిగృహం చేరుకుని అధికారులతో సమీక్షిస్తారు. సాయంత్రం 4.50 గంటలకు కుప్పం రైల్వే స్టేషన్ చేరుకుని ట్రైన్‌లో విజయవాడకు బయల్దేరి వెళ్తారని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నింద్రలో 68.8 మి.మీ వర్షం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 21: జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 10 మండలాల్లో తేలికపాటి నుంచి బలమైన వర్షం కురిసింది. అత్యధికంగా నింద్రలో 68.8 మి.మీ, అత్యల్పంగా పూతలపట్టులో 1.2 మిమీ వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా.. నగరిలో 31.2, విజయపురంలో 28.4, వెదురుకుప్పంలో 22.2, కార్వేటినగరంలో 19.4, పెనుమూరులో 4.2, పాలసముద్రంలో 3.4, శ్రీరంగరాజపురంలో 2.6, రొంపిచెర్లలో 1.4 మి.మీ వర్షం కురిసింది.

హిందువుల మనోభావాలు దెబ్బతీసిన జగన్


మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 21: కోట్లాదిమంది హిందువుల మనోభావాలను మాజీ సీఎం జగన్ దెబ్బతీశారని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చిత్తూరు పార్లమెంటు టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ అన్నారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. హిందువులంతా భక్తి శ్రద్ధలతో కొలిచే శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన ఆనాటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డిలను వెంటనే అరెస్టుచేసి సీబీఐతో మరింత లోతైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం జగన్ ఓట్లకోసం మాత్రమే తిరుమలకు వచ్చారని, ఆయనకు హిందూ మతంపైన ద్వేషం ఉందని మరోసారి రుజువైందన్నారు. బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతిరిధి వెంకటేష్ యాదవ్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో లడ్డూ నాణ్యతపై ఎమ్మెల్యే పరిశీలన


లడ్డూ నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 21: తిరుమల శ్రీవారి లడ్డూ వ్యవహారం నేపథ్యంలో కాణిపాకంలోని పోటులో లడ్డూ నాణ్యతను శనివారం రాత్రి పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పరిశీలించారు. నాణ్యతలో ఏమాత్రం తేడా రాకూడదని పోటు సిబ్బందిని హెచ్చరించారు. భక్తులు ఎవరైనా లడ్డూ రుచిపై ఫిర్యాదు చేస్తే ఉద్యోగులపై చర్యలు తప్పవన్నారు. అలాగే ప్రస్తుతం వాడుతున్న నెయ్యిని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ టెస్ట్‌కు పంపాలని ఆదేశించారు. ఆలయ ఈవో గురుప్రసాద్, మాజీ చైర్మన్ మణినాయుడు, ఏఈవో రవీంద్రబాబు, ఈవో సీసీ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు బదిలీ కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, సెప్టెంబరు 21: జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఎస్పీ మణికంఠ ఆధ్వర్యంలో 175 మంది కానిస్టేబుళ్లకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఒకే స్టేషన్‌లో ఐదేళ్లు పూర్తి చేసుకున్న, వీఆర్‌లో ఉన్న 14 మంది ఏఎస్‌ఐలు, 59 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 102 కానిస్టేబుళ్లకు కౌన్సెలింగ్ జరిగింది. వారు కోరుకున్న ప్రకారం ఖాళీలను అనుసరించి పోలీసుస్టేషన్ ఆప్షన్‌ను కేటాయించారు. ఏవో మోహన్‌రావు, డీపీవో, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి ఇన్‌చార్జి ఆర్డీవోగా రవిశంకర్‌రెడ్డి



తిరుపతి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఇన్‌చార్జి ఆర్డీవోగా రవిశంకర్‌రెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం శ్రీకాళహస్తి ఆర్డీవోగా పనిచేస్తున్న ఆయనను కలెక్టర్ డాక్టర్ సంజామల వెంకటేశ్వర్ తిరుపతి ఇన్‌చార్జి ఆర్డీవోగా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పుత్తూరులో పెట్రోలు బంకు ఏర్పాటుకు సంబంధించి ఎన్‌ఓసీ కోసం దరఖాస్తు చేసుకున్న శీను అనే వ్యక్తిని లంచం పేరిట వేధించారన్న ఆరోపణలపై తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డిని ప్రభుత్వం శుక్రవారం సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఖాళీగా ఉన్న ఆ పోస్టులో ప్రభుత్వం రెగ్యులర్ ఆర్డీవోను నియమించే వరకూ శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు.



జాతీయ రహదారిపై బైఠాయించిన గ్రామస్తులు - నిలిచిపోయిన వాహనాలు

ఇంట్లో ఏ వస్తువు ముట్టుకున్నా షాక్ కొడుతోంది!

- గ్రామంలో ఇద్దరు చనిపోయినా విద్యుత్ శాఖాధికారులు పట్టించుకోరా?
- జాతీయ రహదారిపై బైఠాయించి గుడ్లకట్టమంచి దళితుల నిరసన
- కిలోమీటర్ల మేర స్తంభించిన ట్రాఫిక్

బంగారుపాళ్యం, సెప్టెంబరు 21: 'మా ఇళ్లలో ఏ వస్తువు ముట్టుకున్నా షాక్ కొడుతోంది. గురువారం రాత్రి కూడా మా గ్రామంలో తాతామనవడు ఊయలలో ఊగుతుండగా విద్యుదాఘాతానికి గురై దుర్మరణం చెందారు. అయినా విద్యుత్ శాఖాధికారులు పట్టించుకోలేదు' అంటూ బంగారుపాళ్యం మండలంలోని గుండ్లకట్టమంచి దళితులు శనివారం రాత్రి చెన్నై- బెంగళూరు జాతీయ రహదారిపై బైఠాయించారు. ఒక్కసారిగా వంద మందికిపైగా రోడ్డుపై బైఠాయించి, నిరసనకు దిగడంతో రెండువైపులా కిలోమీటర్ల దూరం వరకు వాహనాలు స్తంభించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి ఇంట్లోనూ ఏ వస్తువును ముట్టుకున్నా షాక్ కొట్టడంతో సంబంధిత ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆపేశామన్నారు. ఇద్దరు చనిపోయినా విద్యుత్ శాఖాధికారులు పట్టించుకోక పోవడం సరికాదన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేవరకు కదిలేదని లేదని భీష్మించుకున్నారు. విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని సర్దిచెప్పి.. ధర్నాను విరమింపచేశారు. అనంతరం విద్యుత్ శాఖ డీఈ హరి, ఏడీఈ కొండయ్యలు గ్రామానికి చేరుకున్నారు. కొత్త ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేసే పనులు మొదలు పెట్టారు.




స్వర్ణ తాపడ తోరణం, పూజాసామగ్రి అందజేస్తున్న దాతలతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి - స్వర్ణ తాపడం చేసిన శనీశ్వరస్వామి సన్నిధానం

స్వర్ణమయం.. శనీశ్వర సన్నిధానం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 21: ముక్కంటి ఆలయంలోని శనీశ్వరస్వామి సన్నిధానం స్వర్ణమయమైంది. హైదరాబాదుకు చెందిన వ్యాపారవేత్తలు మనోజ్, మహేష్‌రెడ్డి సొంత నిధులతో స్వర్ణతాపడం పనులు చేయించారు. స్వర్ణమయమైన తర్వాత తొలిసారి పూజలను శనివారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఇందులో భాగంగా దాతలు స్వామివారికి అలంకరించే పీఠం, తోరణంతో పాటు వివిధ స్వర్ణతాపడంతో తయారు చేసిన పూజా సామగ్రిని అందజేశారు. అర్చకులు సన్నిధిని శుద్ధిచేసిన అనంతరం సంకల్ప పూజలతో శనీశ్వరమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం దాతలను ఘనంగా సత్కరించారు. వారు జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈవో ఎస్‌వీఎస్ఎస్ మూర్తి, టీడీపీ నాయకులు విజయకుమార్, మునిరాజానాయుడు, చెంచయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైద్యం వికటించి పది నెలల బాలుడి మృతి

పుంగనూరు పోలీస్‌స్టేషన్ వద్ద బాధితుల నిరసన



అమ్మమ్మతో సాత్విక్‌నందన్ (ఫైల్‌ఫొటో) - పోలీస్‌స్టేషన్ వద్ద బాధితుల ఆందోళన

పుంగనూరు, సెప్టెంబరు 21: పుంగనూరులో వైద్యం వికటించి పదినెలల బాలుడి మృతి చెందడంతో బాధిత కుటుంబీకులు శనివారం రాత్రి న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పోలీసుల కథనం మేరకు...పెద్దపంజాణి మండలం మాదాండ్లపల్లెకు చెందిన ఓ.బాలసుబ్రహ్మణ్యం పుంగనూరు తూర్పు మొగసాల అర్బన్ హెల్త్‌సెంటర్‌లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. బాలసుబ్రహ్మణ్యం, ఆయన భార్య వెన్నెల, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడితో కలిసి స్థానిక నక్కబండలో కాపురం ఉన్నారు. అతడి భార్య, కుమార్తె, కుమారుడికి పదిరోజులుగా జ్వరం వస్తోంది. కుమారుడు సాత్విక్‌నందన్ (10 నెలలు)కు దగ్గు, జ్వరం, జలుబు ఉండగా స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న కార్తీక్ చిన్నపిల్లల ఆసుపత్రిలో డాక్టర్ కార్తీక్‌రాజ్ వద్ద వైద్యం చేయించారు. సిరప్, మాత్రలు ఇచ్చినా బాలుడికి జ్వరం తగ్గకపోవడంతో మదనపల్లెకు వెళ్లాలని ఆ డాక్టర్ సూచించారు. సాత్విక్‌నందన్‌కు తీసుకుని శనివారం సాయంత్రం మదనపల్లె ఆసుపత్రికి వెళ్లగా అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని తీసుకుని కుటుంబీకులు కార్తీక్ ఆసుపత్రికి వచ్చి గొడవ చేశారు. నీ వల్లే వైద్యం వికటించి తమ బిడ్డ చనిపోయాడని ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆయన ఆసుపత్రి మూసేసి వెళ్లాడు. బాధితులు పుంగనూరు పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ తమ బిడ్డ మృతికి డాక్టర్ కార్తీక్ కారణమని, వెంటనే డాక్టర్‌ను అరెస్టు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పుంగనూరు సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ మీకు న్యాయం చేస్తామని సర్దిచెప్పి బాలుడి మృతదేహాన్ని శవపరీక్ష కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటితో ముగియనున్న బదిలీల గడువు

- రాజకీయ సిఫార్సులతో జిల్లా యంత్రాంగం ఉక్కిరిబిక్కిరి

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 21: ఉద్యోగుల బదిలీలకు, ఎమ్మెల్యేల సిఫారసు లేఖలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం తొలి విడతగా బదిలీల జాబితాను తయారు చేసింది. విద్య, వైద్య, వ్యవసాయ అనుబంధ శాఖల్లో మినహా మిగిలిన 15 ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం అవకాశమిచ్చింది. వాస్తవానికి ఈనెల 15వ తేదీకల్లా ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు ముగిసింది. అయితే భారీ వర్షాలు, వరదల కారణంగా ఉద్యోగులంతా విజయవాడ తరలివెళ్లడంతో బదిలీలను వాయిదా వేసింది. చివరికి ఆదివారం నాటికి బదిలీల ప్రక్రియకు తుది గడువు ప్రకటించింది. ఈ క్రమంలో సిఫారసు లేఖలతో అధికారులపై ఒత్తిడి చేస్తూ కోరుకున్న చోటు దక్కించుకునేందుకు రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, జిల్లాపరిషత్, డీఆర్‌డీఏ, డ్వామా, ఇంజనీరింగ్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సైతం తమదైన శైలిలో పైరవీలు ప్రారంభించారు. శనివారం రాత్రి పొద్దుపోయే వరకు రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల బదిలీల ప్రక్రియపై అధికారులు కసరత్తు చేశారు. జిల్లాలో 34 మండలాలకు సంబంధించి వీఆర్వో, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, ఆర్ఐ, డిప్యూటీ తహసీల్దార్ల బదిలీల జాబితా సిద్ధమైంది. ఆదివారం సాయంత్రానికల్లా రెవెన్యూ ఉద్యోగుల బదిలీలు అధికారికంగా వెలువడనున్నాయి. గ్రేడ్ 1, గ్రేడ్2, గ్రేడ్3, గ్రేడ్4 పంచాయతీ కార్యదర్శులకు వారి సీనియార్టీని బట్టి 450 పంచాయతీలకు పైగా నూతన పోస్టింగ్ ఇవ్వనున్నారు. చంద్రగిరి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, సత్యవేడు, గూడూరు నియోజకవర్గాల్లో మేజర్ పంచాయతీ కార్యదర్శి పోస్టులకు విపరీతమైన పోటీ నెలకొంది. 'మన ప్రభుత్వం మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు బదిలీల నుంచి తాత్కాలికంగా మినహాయింపు ఇచ్చినట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో వచ్చిన ఆర్డీవోలు (ఎస్‌డీసీ) సైతం ఇప్పటికీ జిల్లాలో కొనసాగుతున్నారు. వారి బదిలీలు కూడా ఆదివారం నాటికి రానున్నాయి. మిగిలిన శాఖల్లో కూడా బదిలీల ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన ఈ బదిలీలు జరుగనున్నాయి.

పొదుపు మహిళలకు త్వరగా రుణాలు


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎల్డీఎం హరీష్ తదితరులు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 21: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఐఎల్‌వో సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఐదు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఎల్డీఎం హరీష్ ప్రారంభించి, ప్రసంగించారు. మహిళలు వ్యాపారంలో రాణించడానికి అవసరమైన ముద్ర, ఫుడ్ ప్రాసెసింగ్ లోన్స్ అందిస్తామన్నారు. పొదుపు సంఘాల్లోని మహిళలకైతే త్వరగా రుణసౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.గుణశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. పరిశ్రమ శాఖ ద్వారా విద్యుత్ సబ్సిడీ, పరిశ్రమల స్థాపనకు కావాల్సిన అనుమతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శిక్షణ పొందిన వారికి కలెక్టర్ అనుమతితో రుణ సహకారం అందిస్తామని చెప్పారు. ఐఎల్వో మాస్టర్ ట్రైనర్ ధనుంజయ మాట్లాడుతూ.. మార్కెట్‌లో డిమాండ్ ఉన్నటువంటి వ్యాపార అవకాశాలను తెలియజేశారు. 30 మంది ఔత్సాహిక మహిళలు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

'ఆకుపేను'తో కొబ్బరి రైతు విలవిల!



కుప్పం, సెప్టెంబరు 21: కొబ్బరి తోటలను ఆశిస్తున్న ఆకు కొరుకుడు పేను రోగంతో రైతులు విలవిలాడుతున్నారు. నివారణోపాయం తెలియక, రోగం ఉపశమించే మార్గం కానరాక తీవ్రంగా నష్టపోతున్నారు. ఉద్యాన శాఖ ద్వారా అందాల్సిన సలహాలు, సూచనలు వారికి అందడంలేదు. కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ కొబ్బరి తోటలు నిలువునా ఎండిపోయినట్లు కనిపిస్తున్నాయి. పచ్చగా ఉండాల్సిన కొబ్బరి ఆకుల మట్టలు అగ్గి పెట్టినట్లు బూడిద రంగుకు మారిపోయాయి. చాలాచోట్ల కొబ్బరి దిగుబడి తగ్గిపోయింది. కొన్ని ప్రాంతాల్లో కొబ్బరి కాయలు వస్తున్నాయి కానీ వాటి పరిమాణం, నాణ్యత దిగనాసిల్లిపోయింది. కుప్పం మండలంలోని పెద్దబంగారునత్తం, వానగుట్టపల్లె, కృష్ణదాసనపల్లె, మల్లానూరు తదితర గ్రామాలన్నింటిలో ఎక్కడా కొబ్బరి తోటల్లో కాపు కనిపించడంలేదు. గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితి కారణం కొబ్బరి తోటలను ఆకు తినే పేను రోగం ఆశించడమేనని రైతులు చెబుతున్నారు. ఈ రోగం సోకిన కొబ్బరి చెట్టు ఆకులు పూర్తిగా ఎండిపోతాయి. దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది. నాణ్యత ఉండదు. సాధారణంగా రైతులు ఒక కాయ రూ.10 వంతున హోల్‌సేల్‌గా తోటమీదనే వ్యాపారులకు విక్రయిస్తుంటారు. ఈ కొబ్బరి కాయను ఒకటి రూ.20 నుంచి రూ.35 దాకా రిటైల్ దుకాణాల్లో అమ్ముతుంటారు. కానీ దిగుబడి పూర్తిగా తగ్గిపోవడంతో రైతులు నష్టాల బాట పట్టారు. వచ్చిన కాపులో కూడా కాయ పరిమాణం, నాణ్యత తగ్గిపోవడంతో ధర పలకడం లేదు. అంతేకాదు, ఆకు తినే పేను రోగం వచ్చిన చెట్టు కాయ నీళ్లు తాగరాదని రైతులు అంటున్నారు. అయితే నియోజకవర్గంలో ఎటుచూసినా కొబ్బరి తోటలు రోగానికి గురి అవుతున్నా, ఉద్యాన శాఖాధికారులు తమవైపు తొంగి చూడడంలేదని రైతులు వాపోతున్నారు. ఆకు కొరికే పేను రోగం తగ్గడానికి, నివారణకు సూచనలు, సలహాలు ఇచ్చి రైతులను కష్టనష్టాలనుంచి బయటపడేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

తిరుమల పవిత్రతను నవ్వుల పాలు చేస్తారా?



బంగారుపాళ్యం, సెప్టెంబరు 21: తిరుమల పవిత్రతను నవ్వులపాలు చేశారంటూ శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు మూడు నామాలు పెట్టుకుని ర్యాలీ నిర్వహించారు. లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీ ధరణీప్రసాద్ నాయుడు, కమల్‌నాథ రెడ్డి, జనార్దన్ గౌడ్, రమేష్, నాగరాజ గౌడ్, కోకా ప్రకాష్ నాయుడు, కుప్పాల మురళి, జాకీర్ హుస్సేన్, రాధాకృష్ణమ నాయుడు, కృష్ణకుమారి, కవి, కొండేటి శివ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూ కల్తీపై బీజేపీ ఫిర్యాదు



ఐరాల, సెప్టెంబరు 21: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగంపై ఐరాల ఎస్ఐ నరసింహులుకు మండల బీజేపీ నాయకులు శనివారం ఫిర్యాదు చేశారు. నాయకులు రాజేష్‌రెడ్డి, పెరుమాళ్లసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. కల్తీ నెయ్యి వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఈ చర్యకు పాల్పడిన మాజీ సీఎం జగన్, పూర్వపు ఈవో ధర్మారెడ్డి, పాలక మండలి మాజీ అధ్యక్షుడు వైవీ.సుబ్బారెడ్డిపై కేసు నమోదు చేయాలని విన్నవించారు. ఎస్ఎస్ఎఫ్ మండల కన్వీనర్ పెద్దరెడ్డెప్ప, రమణాచారి, బషీర్, సుధాకర్, శీను తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

అన్న క్యాంటీన్ నిర్వహణకు రూ.లక్ష విరాళం



పుంగనూరు, సెప్టెంబరు21: అన్న క్యాంటీన్ నిర్వహణకు పుంగనూరు విశ్రాంత డీఎస్పీ సుకుమార్ దంపతులు లక్ష రూపాయల చెక్కును మంత్రి నారా లోకేశ్‌కు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సుకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతో మంది పేదలు, కూలీల ఆకలి తీర్చడానికి అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పుంగనూరు నియోజకవర్గంలోని చెరువుల్లో ముళ్లకంపలను తొలగించాలని, ప్రభుత్వ భూములు, వంకలు, చెరువులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు లోకేశ్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన వివరించారు. ఆయన వెంట నాయకులు దేశాధి శ్రీనివాసులు, రవికుమార్, అల్తాప్ తదితరులు ఉన్నారు.

వి.కోట అల్లర్ల కేసులపై డీఎస్పీ సమీక్ష

వి.కోట, సెప్టెంబరు 21: ఇటీవల వి.కోటలో జరిగిన ఇరువర్గాల ఘర్షణ తదనంతర అల్లర్ల కేసులపై డీఎస్పీ ప్రభాకర్ సమీక్షించారు. శనివారం వి.కోట అర్బన్ స్టేషన్‌కు చేరుకున్న డీఎస్పీ నిందితుల అరెస్టులపై ఆరా తీశారు. ఇరు వర్గాల ఫిర్యాదుల మేరకు ఏడు కేసులు నమోదు చేసిన పోలీసులు నిందితులను గుర్తించారు. ఇరు వర్గాలకు చెందిన సుమారు వంద మందికి పైగా కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు సమాచారం. వీరిలో సుమారు 40 మందిని స్టేషన్‌కు పిలిపించి విచారించి సెక్షన్ 41 నోటీసులు జారీ చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు సీఐ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇతర నిందితుల కోసం అన్వేషిస్తున్నామని, త్వరలో అందరినీ అరెస్టు చేస్తామని తెలిపారు.

ఆరోగ్య సమాజం కోసం క్రీడలు అవసరం



విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

కుప్పం, సెప్టెంబరు 21: ఆరోగ్య సమాజం కోసం క్రీడలు ఎంతో అవసరమని బీసీఎన్ విద్యాసంస్థల ఛైర్మన్ బీసీ.నాగరాజు అన్నారు. కుప్పం పబ్లిక్ స్కూల్‌లో శనివారం క్రీడా దినోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పిల్లలు చదువుతోపాటు క్రీడలు, వ్యాయామం పట్ల కూడా దృష్టి పెట్టాలన్నారు. స్కూల్ ఛైర్‌పర్సన్ శాంతా నాగరాజ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలను క్రీడారంగంలో ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల విన్యాసాలు అలరించాయి. ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కుప్పం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన డాక్టర్ ఎస్.సునీల్ రాజ్, సీఈవో సాగర్ రాజ్, ప్రధానోపాధ్యాయురాలు దమయంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా విజేతలకు బహుమతుల పంపిణీ



రొంపిచెర్ల, సెప్టెంబరు21: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు జరిగిన క్రీడా పోటీల్లోని విజేతలకు శనివారం బహుమతులు పంపిణీ చేశారు. కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో కేజీబీవీ విజేతలుగాను, త్రోబాల్‌లో బొమ్మయ్యగారిపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఖోఖో, వాలీబాల్ జూనియర్, సీనియర్ బాలుర, బాలికోన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా బహుమతులు పొందారు. ఎంఈవో ఇందిర మాట్లాడుతూ విద్యార్థుల్లో చైతన్యం నింపడానికి, మానసిక ఒత్తిడి తగ్గించడానికి, శరీర దృఢత్వానికి క్రీడలు ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 శ్రీనివాసులు, సీఆర్‌పీలు, పీడీ షాదిక్, టీడీపీ నాయకులు ఇమ్రాన్‌ఖాన్, గౌస్‌పీర్‌ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోయకొండ దసరా మహోత్సవ పోస్టర్ అవిష్కరణ

చౌడేపల్లె, సెప్టెంబర్21: బోయకొండ గంగమ్మ ఆలయ దసరా మహోత్సవ పోస్టర్‌ను శనివారం పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తన నివాసంలో అవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 4న బాలాత్రిపురసుందరీదేవి, 5న శాకాంబరీదేవి, 6న అన్నపూర్ణాదేవి, 7న పార్వతీదేవి, 8న దనలక్ష్మీదేవి, 9న సరస్వతీదేవి, 10న దుర్గాదేవి, 11న హహిషాసురమర్థినిదేవి, 12 రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు అమ్మవారు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈవో ఏకాంబరం, అర్చకులు పాల్గొన్నారు.

శాంతిపురంలో మండల సమాఖ్య సమావేశం

శాంతిపురం, సెప్టెంబర్ 21 : స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం మండల సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ ఉదయకుమార్ మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల ద్వారా చాలా మంది మహిళలు ఆర్థికంగా ఎదిగారన్నారు. అనంతరం మండల సమాఖ్య కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షురాలిగా శ్యామల, కోశాధికారిగా సరిత, కార్యదర్శిగా రమ్యను పొదుపు సంఘాల వీవో లీడర్లు ఎన్నుకున్నారు. అలాగే మండల సమాఖ్య రైతు కమిటీని ఎన్నుకొన్నారు. అధ్యక్షురాలిగా అమృతమ్మ, కార్యదర్శిగా విజయకుమార్, కోశాధికారిగా నారాయణరెడ్డిలను ఏకగ్రీవంగా ఏన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గ్రీట, వెలుగు సీసీలు గోపి, భాగ్యలక్ష్మి, రామచంద్ర, మోహన్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

యంత్రాల ద్వారా ఉపాధి పనులపై ఫిర్యాదు



ఎక్స్‌కవేటర్‌తో తీసిన గుంత

పెద్దపంజాణి, సెప్టెంబరు21: ఉపాధి హామీ పనులలో అవకతవకలు జరుగుతున్నాయని పెద్దపంజాణి మండలం తుర్లపల్లె గ్రామస్తులు ఎంపీడీవో అబ్దుల్ జబ్బార్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. గ్రామ సమీపంలోని గౌనిచెరువులో పూడికతీత పనులు జరుగుతున్నాయని, క్షేత్ర సహాయకుడు పగటిపూట కూలీలతో చేయిస్తూ రాత్రిపూట ఎక్స్‌కవేటర్‌తో పూడిక తీస్తూ బిల్లులు చేసుకుంటున్నాడని, చర్యలు తీసుకోవాలని కోరారు.

మొగలి ఘాట్ రోడ్డు ప్రమాద బాధితులకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేత



వి.కోట, సెప్టెంబరు 21: ఇటీవల మొగలి ఘాట్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంతో వి.కోట మండలం యాలకల్లు పంచాయతీ ఎం.ఎం.కుంట గ్రామానికి చెందిన కుల్‌సున్‌బీ మృతి చెందింది. ప్రభుత్వం మృతుల కుంటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం ప్రకటించింది. శనివారం కుంభార్లపల్లె ప్రజావేదిక సభలో ప్రభుత్వం నుంచి వచ్చిన రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును మృతురాలి కుటుంబ సభ్యులకు అమరనాథరెడ్డి అందించారు. ఈ మొత్తాన్ని ఆమె ఇద్దరు కుమార్తెలు, ముగ్గరు కుమారులు సమానంగా పంచుకుంటామని ఆయనకు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

గంగవరం, సెప్టెంబరు 21 : మండలంలోని ఆలకుప్పం గ్రామంలో శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనం చోరీ ఘటనపై కేసు నమోదు చేశామని గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం రాత్రి ఆలకుప్పం గ్రామానికి చెందిన రమేష్ తన స్కూటర్‌ను ఇంటిముందు లాక్ చేసి ఉంచగా, శనివారం ఉదయం చూసేసరికి కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ద్విచక్ర వాహనం కనిపించకపోవడంతో, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చల్లా పర్యటనను విజయవంతం చేయాలి

కల్లూరు, సెప్టెంబర్ 21: పులిచెర్లలో మంగళవారం పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, ఎంపీడీవో రాజశేఖర్‌బాబు కోరారు. పులిచెర్ల మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో శనివారం మండల స్థాయి అధికారులు, సంఘమిత్రలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ జయసింహ, ఎంఈఓలు శిద్ధరామయ్య, పోకల తాతయ్య, ఏపీఓ షౌకత్, ఈఓపీఆర్డీ యుగంధర్, టీడీపీ నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవపై అవగాహన ర్యాలీ

పలమనేరు, సెప్టెంబరు21 : పలమనేరు మున్సిపల్ కార్యాలయం నుంచి శనివారం ఉదయం స్వచ్ఛతా హీ సేవపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్ ఈ ర్యాలీని ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయంనుంచి జాతీయ రహదారిలోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత డీఎస్పీ అన్నదానం



పుంగనూరు, సెప్టెంబరు21: కూటమి ప్రభుత్వం పదికాలల పాటు రాష్ట్రాన్ని పాలించడానికి కళ్యాణ వెంకటరమణస్వామి ఆశీర్వాదం అందించాలని కోరుతూ విశ్రాంత డీఎస్పీ సుకుమార్ దంపతులు అన్నదానం చేశారు. శనివారం స్థానిక కళ్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు అన్న ప్రసాదాలు అందజేశారు.

23లోపు ఈ క్రాప్ చేయించుకోవాలి

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 21: ఈనెల 23వ తేదీలోపు రైతులు తాము సాగుచేసిన పంటలను ఈ-క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏడీఏ శివకుమార్‌రాజు కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుంగనూరు డివిజన్ పరిధిలో 29427 మంది రైతులు ఈకెవైసీ చేసుకున్నారని, ఇంకా 3571 మంది రైతులు చేసుకోవాల్సివుందన్నారు. ఈ అవకాశాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కేజీబీవీలో శాంతి దినోత్సవం

రొంపిచెర్ల, సెప్టెంబరు21: మండలంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలో ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ గ్రేట్ విజన్ సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో శనివారం శాంతిదినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు జీవిఎస్ బాబు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడుకున్న నిబద్ధతను విద్యార్థి దశ నుంచి అలవర్చుకోవాలన్నారు. యువత అలోచనలు శాంతి మార్గం వైపు ఉండాలన్నారు. విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యావేత్త రఘునాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం



రామకుప్పం, సెప్టెంబరు 21: విజయవాడ వరద బాధితులకు రామకుప్పం మండలం ఉన్సిగానిపల్లె పంచాయతీకి చెందిన టీడీపీ నేతలు ప్రజలు రూ.1,11,116 విరాళంగా ఇచ్చారని టీడీపీ సీనియర్ నేతలు రామ్మూర్తి, జయశంకర్, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తెలిపారు. విరాళాల మొత్తాన్ని వారు శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, తెలుగుయువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్‌కు అందజేశారు. కార్యక్రమంలో నేతలు మహేంద్ర నాయుడు, రామలింగం, మణిష్, షణ్ముగం, సుభాష్, గోపీ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బేరి సంఘం సాయం

పలమనేరు, సెప్టెంబరు21 : విజయవాడ వరద బాధితుల కోసం శనివారం స్థానిక బేరి సంఘం నాయకులు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కలిసి రూ. 50 వేలు చెక్కును విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో బేరిసంఘం నాయకులు బీఆర్సీకుమార్, జగన్నాథం, సోమశేఖర్, కూర్నిపల్లి గవన్న, బాలన్న , రెడ్డెప్ప, మల్లి, ప్రణీత్, ప్రవీణ్, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



చౌడేపల్లె, సెప్టెంబర్21:స్థానిక బజారు వీధిలో వెలసిన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఉన్న ఆక్రమణలను ఎక్స్‌కవేటరుతో తొలగించారు. శనివారం ఆలయ గోపురం వద్ద ఉన్న ఓ పెంకుటిల్లును, గ్రామ పెద్దల సమక్షంలో తొలగించారు.

నేడు సూరయ్యగారిపల్లెలో వలసదేవర్లు

సోమల, సెప్టెంబరు21: మండలంలోని నడింపల్లెలో ఆదివారం వలసదేవర్లు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు శనివారం రాత్రి గ్రామంలో దండోరా వేశారు. ఈక్రమంలో నడివీధి గంగమ్మకు పూజలు చేశారు. ఇతర ప్రాంతాల వారు గ్రామంలోకి వెళ్లరాదని తెలిపారు.

27 వరకు ఉపాధి పనుల తనిఖీ

పుంగనూరు రూరల్, సెప్టెంబరు21: ఈనెల 27తేదీ వరకు మండల పరిధిలో జరిగిన ఉపాధి హామీ పనులను తనిఖీ చేయనున్నట్లు ఏపీవో శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 2023-2024 ఏడాదిలో జరిగిన పనులను తనిఖీ చేయనున్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, సెప్టెంబరు21: పురుగులమందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చౌడేపల్లె మండలంలో చోటుచేసుకుంది. డి. రాజులూరుకు చెందిన రెడ్డెప్ప కుమారుడు గోవర్ధన్(22) పురుగులమందు తాగి స్పృహ కోల్పోవడంతో పుంగనూరు ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమించడంతో తిరుపతికి రెఫర్ చేసినట్లు డాక్టర్లు తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, సెప్టెంబరు21: తల్లిదండ్రులు ఘర్షణ పడుతున్నారని ఓ యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం రామసముద్రం మండలంలో జరిగింది. రామసముద్రం మండలం ఎలావానెల్లూరుకు చెందిన రమణప్ప కుమార్తె మమత(18) రెండు రోజులుగా తల్లిదండ్రులు గొడవ పడుతుండటంతో బాధతో పురుగుల మందు తాగినట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పెద్దపంజాణి, సెప్టంబరు 21: కర్ణాటక నుంచి మద్యం తరలిస్తున్న వ్యక్తిని ఎస్‌ఐ సహదేవి తన సిబ్బందితో దాడి చేసి అరెస్ట్ చేశారు. శనివారం ముత్తుకూరు క్రాస్ వద్ద పెద్దపంజాణి మండలం గల్లావారిపల్లెకు చెందిన జగపతి ద్విచక్రవాహనంలో 96 టెట్రా పాకెట్లను తరలిస్తుండగా పట్టుకున్నారు. మద్యం స్వాధీనం చేసుకుని ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

సంక్షోభంలోనూ ప్రజలకు సంక్షేమం

ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



బాలేంద్రపల్లెలో ఇది మంచి ప్రభుత్వం స్టిక్కరును అందిస్తున్న ఎమ్మెల్యే

వి.కోట, సెప్టెంబరు 21: రాష్ట్రంలో ఉన్న సంక్షోభ పరిస్థితులను అధిగమించి కూటమి ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు సంక్షేమం అందిస్తోందని ఎమ్మెల్యే ఎన్.అమరనాథరెడ్డి అన్నారు. శనివారం వి.కోట మండలం కుంభార్లపల్లె పంచాయతీలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బాలేంద్రపల్లె, ముమ్మిడేర్లపల్లె, కుంభార్లపల్లె గెస్తింపల్లె గ్రామాల్లో పర్యటించారు. అనంతరం కుంభారుపల్లెలో జరిగిన ప్రజావేదిక సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గత ప్రభుత్వం ప్రజావేదికను కూల్చివేసి పాలన మొదలు పెట్టగా, ఈ కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో ప్రజలకు సంక్షేమం అందించి రాష్ట్రవ్యాప్తంగా ప్రజావేదికలతో కార్యక్రమాలు ప్రారంభించిందన్నారు. విజయవాడలో అకాల వర్షాలతో వరదలు వస్తే సీఎం చంద్రబాబు అక్కడే బాదితులకు తోడుగా ఉండి భరోసా కల్పించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో సాధించిన ప్రగతితో ప్రజల్లోకి వెళుతున్నామన్నారు. గెస్తింపల్లె సమీపంలో ప్రారంభించిన కోల్డ్‌స్టోరేజ్ పిల్లర్ల దశలోనే ఆగిందని, దానిని రూ. 8 కోట్ల వ్యయంతో పూర్తి చేస్తామని తెలిపారు. వి.కోటలో బైపాస్ రోడ్డును పట్టణానికి తూర్పు వైపునే వేయిస్తామని హామీ ఇచ్చారు. ఏనుగుల సమస్య పరిష్కారానికి కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను తెచ్చి రూ. 16 కోట్ల వ్యయంతో శిక్షణ ఏనుగుల ద్వారా మదపుటేనుగులను కట్టడి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మెన్ రామచంద్రనాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు రంగనాథ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, నేతలు రాంబాబు, చౌడప్ప, విశ్వనాథ్, నాగరాజ్, శబరీష్, చంద్రారెడ్డి, మహేష్‌రెడ్డి, హరి, కుమార్, మండల పరిధి అన్ని పంచాయతీల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వంతోనే మంచి పాలన : పీఎస్ఎం

కుప్పం రూరల్, సెప్టెంబరు 21: అయిదేళ్లపాటు వైసీపీ దుర్మార్గ పాలన చవిచూసిన రాష్ట్రం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిత్వంలో ఊపిరి పీల్చుకుంటోందని టీడీపీ నియోకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం అన్నారు. టీడీపీ ప్రభుత్వంవల్లనే మంచి పాలన సాకారమైందన్నారు. మండలంలోని మంకలదొడ్డి పంచాయతీలో శనివారం 'ఇది మంచి ప్రభుత్వం' గ్రామ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పీఎస్ఎం మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనలో చేసిన మంచి పనుల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, ఎంపీడీవో సాయి లహరి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఏవీ.రవి, మాజీ సర్పంచి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ 'మంచి ప్రభుత్వం' స్టిక్కర్

కుప్పం : కుప్పం మండలంలోని మంకలదొడ్డి, దాసేగానూరు, కంగుంది, దేవరాజపురం పంచాయతీలలో టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ఇల్లిల్లూ తిరుగుతూ కరపత్రాలు పంచారు. స్టిక్కర్లు అంటించారు. వీరికి అధికారులు సైతం తోడయ్యారు. కరపత్రాలను ప్రజలకు పంచుతూ తమ ప్రభుత్వం పాలనలో భవిష్యత్తులో అమలు చేయబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరిస్తున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ధనశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి ఏవీ.రవి, నాయకులు షరీఫ్, గనేశ్, ఎంపీడీవో సాయి లహరి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హేమలత, హౌసింగ్ ఏఈ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

గుడుపల్లె: మండలంలోని బెగ్గిలపల్లె, శెట్టిపల్లె, పెద్దబజనవాడ పంచాయతీల్లో శనివారం గ్రామసభలు జరిగాయి. మండల టీడీపీ అధ్యక్షుడు బాబు, జనసేన మండలాధ్యక్షుడు అమీర్, తెలుగు యువత అధ్యక్షుడు వెంకటేష్, సర్పంచ్ రీటా ఎల్లప్ప, ఎంఈవోలు శ్రీదేవి, లక్ష్మయ్య ఈవోపీఆర్డీ సర్గుణ, కార్యదర్శి చంద్రప్ప పాల్గొన్నారు.

శాంతిపురం : కూటమి ప్రభుత్వ వంద రోజుల పరిపాలనపై శనివారం ఎంపీడీవో కూమార్ ఆధ్వర్యంలో సొన్నేగానిపల్లె సచివాలయంలో నేతలు, అధికారులు ప్రజలతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తరువాత దండికుప్పం, కిలమడుగు సచివాలయం పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ ఉదయకుమార్‌నాయుడు, ఎంపీడీవో కుమార్ సర్పంచ్ పుష్పవతి, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి నాగరాజు, సీడీపీవో కల్పన, ఏఎంసీ నాగరాజు, యూనిట్ ఇన్‌చార్జి బాలు, మండల టీడీపీ వక్కలిగ కుల సంఘం అధ్యక్షుడు మనేగౌడు తదితరులు పాల్గొన్నారు.



మంకలదొడ్డిలో జరిగిన సభలో మాట్లాడుతున్న పీఎస్ మునిరత్నం

పలమనేరు : పలమనేరు 8వ వార్డులోని గొబ్బిళ్లకోటూరులో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. అనంతరం జరిగి సమావేశంలో వందరోజుల కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించడంతోపాటు నియోజకవర్గంలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఇంటింటి వద్ద ఇది మంచి ప్రభుత్వం అని ముద్రించిన స్టిక్కర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శారదమ్మ, వైస్‌ఛైర్‌పర్సన్ గుల్షన్, కమిషనర్ రమణారెడ్డి, తహసీల్దార్ ఇన్నసాథన్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు, టీడీపీ నాయకులు సుబ్రమణ్యంగౌడు, ఆర్బీసీ కుట్టి, గిరిబాబు,నాగరాజు, ఖాజాపీర్, శ్రీధర్, మదన్‌మోహన్, చాంద్‌బాషా, బీఆర్సీకుమార్, సుబ్బనాగయ్య, గణేష్, చంగప్ప పాల్గొన్నారు.

రామకుప్పం : రాష్ట్రంలో అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు తెలిపారు. శనివారం పంద్యాలమడుగు, ఆనిగానూరు, బైపరెడ్లపల్లె, రాజుపేట గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం సభల్లో వారు మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి పార్టీలు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ప్రభుత్వం అమలుచేసి తీరుతుందన్నారు. ఆయా గ్రామసభల్లో మండల ప్రత్యేకాధికారి పురుషోత్తం, ఎంపీడీఓ ఈశ్వరన్, ఉన్సిగానిపల్లె సర్పంచు నేత్రావతి, టీడీపీ సీనియర్ నేతలు కృష్ణానాయక్, విశ్వనాథ్‌లు రామ్మూర్తి, జయశంకర్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులుగౌడు తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె : ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం బైరెడ్డిపల్లెలో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, సర్పంచ్ వెంకటేష్, తహసీల్దార్ మాధవరాజు, ఎంఈవో సుబ్రమణ్యం, ఏపీవో హరినాథ్, గ్రామకార్యదర్శి సదాశివయ్య, ఎంసీవో సురేష్‌బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాకష్టాలు తీర్చడంలో ముందున్న సీఎం : చల్లా



ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతున్న చల్లాబాబు

రొంపిచెర్ల, సెప్టెంబరు21: ప్రజల కష్టాలను తీర్చడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుంటారని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మోటుమల్లెల పంచాయతీ పెళ్లి గంగమ్మ గుడి సమీపంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చల్లాబాబు మాట్లాడుతూ వంద రోజుల కూటమి పాలనలో పింఛన్లు ఒకేసారి ఇవ్వడం, రూ5లకే అన్నక్యాంటీన్ల ద్వార పేదలకు ఆహారం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, ప్రతి నెలా 1వ తేదిన ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం, విజయవాడ వరదల్లో చిక్కుకున్న ప్రజలను ఆదుకోవడానికి సీఎం కంటికి నిద్రలేకుండా పనిచేశారన్నారు. ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. అనంతరం దాసరిగూడెంలో కరపత్రాలు అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో రెడ్డెప్పఆచారి, నియోజకవర్గం టీడీపీ పర్యవేక్షకులు దపూడి భాస్కర్‌యాదవ్, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు రామనాథంనాయుడు, పులిచెర్ల జడ్పీటీసీ మురళీధర్, టీడీపీ, జనసేన మండల పార్టీ అధ్యక్షులు ఉయ్యాలరమణ, రాజశేఖర్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

గురజాడ రచనలు చదివి ఆదర్శంగా నిలవాలి



గురజాడ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్

పలమనేరు, సెప్టెంబరు21 : విద్యార్థులు గురజాడ రచనలు చదివి ఆదర్శంగా నిలవాలని పలమనేరు ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. బాబు అన్నారు. శనివారం ఆ కళాశాలలో గురజాడ అప్పారావు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమావేశం నిర్వహించి గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి తన రచనల ద్వారా గురజాడ ఎంతగానో కృషి చేశారన్నారు. తెలుగు విభాగాధిపతి వాసు మాట్లాడుతూ సమాజంలోని దురాచారాలను కన్యాశుల్కం నాటకంలోని ప్రతిపాత్ర ద్వారా చక్కగా చిత్రీకరించారని, తెలుగుభాష ఉన్నంత వరకు ఆయనను మరువలేమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ షణ్ముగం, అధ్యాపకులు సుబ్బయ్యనాయుడు, బాలాజి, కిరణ్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్ : గురుజాడ అప్పారావు జయంతి సందర్భంగా పుంగనూరులోని లినార్డు పాఠశాల ఆవరణలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. హెచ్ఎం ఉషారాణి, విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటపతి, రెడ్డెప్పరెడ్డియాదవ్, వక్కంతం నాగభూషణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంగవరం : నేటి కవులకు గురజాడ ఆదర్శమూర్తి అని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసినాథం నాయుడు కొనియాడారు. శనివారం గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకొని స్థానిక కళామందిరంలో గురజాడ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాడ కన్యాశుల్కం నాటకం నేటికి కూడా సమాజంలో సజీవంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, ప్రముఖ కవి మాధవరెడ్డి, చంద్రశేకరయ్య, బాబు ,నవీన్, భార్గవి, విష్ణు పాల్గొన్నారు.

వైభవంగా గణనాథుడి నిమజ్జనం



పుంగనూరు, సెప్టెంబరు 21: వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని ఎన్ఎస్ పేట వీధి, కట్టకింద పాళ్యం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను శనివారం సాయంత్రం నిమజ్జనానికి తరలించారు. ఎన్ఎస్‌పేటలోని వినాయక విగ్రహం వద్ద ఏర్పాటు లడ్డూను వేలం వేయగా భార్గవి రూ.లక్షకు దక్కించుకున్నారు. వినాయక బొగ్గిటిలో పెట్టిన వెండి నాణెంను మణి రూ. 53వేలు పాట పాడి దక్కించుకున్నారు. స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు. పట్టణ సమీపంలోని పాములకుంట వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

పుంగనూరు, సెప్టెంబరు 21: పట్టణ పరిధిలో ప్రభుత్వ స్థలాలు, వంకలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం పట్టణంలోని కోనేటి సమీపంలో కొంతమంది మున్సిపల్ మరుగుదొడ్లు ఆక్రమించి కట్టడాలు నిర్మిస్తున్న ఫిర్యాదు చేయడంతో ఆయన స్పందించారు. టౌన్‌ప్లానింగ్ అధికారి సుభప్రద తన సిబ్బందితో అక్కడకు చేరుకుని ఆక్రమణలను తొలగించారు.

విద్యా సామగ్రి పంపిణీ

సదుం, సెప్టెంబరు 21: స్థానిక గురుకులంలోని 5వ తరగతి విద్యార్థులకు శనివారం యూనిఫాం, బ్యాగులను జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ఎంఐఎస్, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ జయప్రకాశ్ పంపిణీ చేశారు. ఎంఈవో-2 దామోదర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుంగనూరు పరిపాలనాధికారిగా మస్తాన్‌వలీ



పుంగనూరు రూరల్, సెప్టెంబరు21: పుంగనూరు పరిపాలనాధికారిగా మస్తాన్‌వలీ శనివారం బాధ్యతలు చేపట్టారు. పుంగనూరులో పని చేస్తున్న రాజేశ్వరి సస్పెండ్ కావడంతో వి.కోటలో పని చేస్తున్న మస్తాన్‌వలీ బదిలీపై పుంగనూరుకు వచ్చారు.

అక్రమంగా నిల్వ ఉంచిన టపాకాయల సీజ్



పెద్దపంజాణి, సెప్టంబరు 21: మండలంలోని నిడిగుంటలో అక్రమంగా నిల్వ ఉంచిన టపాకాయలను ఎస్ఐ సహదేవి సీజ్ చేశారు. నిడిగుంటలోని నాగేశ్వరయ్య అనుమతులు లేకుండా రూ3,47,750 లక్షలు విలువచేసే టపా కాయలు నిల్వ ఉంచడంతో సీజ్ చేశారు. ఆయనపై కేసు నమోదు చేశారు.

పలమనేరు : స్థానిక తహసీల్దార్ వీధిలోని వెంకటేశు అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 2 లక్షలు విలువ చేసే టపాకాయలను పోలీసులు సీజ్ చేశారు. పలమనేరు పోలీసుల కేసు విచారణ చేస్తున్నారు.

గాయపడిన కార్యదర్శి మృతి



సుబ్రమణ్యం (ఫైల్‌ఫొటో)

శాంతిపురం, సెప్టెంబర్ 21 : ఈ నెల 13న శాంతిపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మొరసనపల్లె పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం(40) బెంగళూరులో చికత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఎంపీడీవో ఏపీఆర్ కుమార్, సిబ్బంది మండల సచివాలయంలో సుబ్రమణ్యం చిత్రపటాన్ని ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రామకుప్పం మండలం ఆవులకుప్పంలో జరిగిన అంత్యక్రియల్లో పాల్గొని సుబ్రమణ్యం మృతదేహానికి అంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు రూ.70వేలు ఆర్థిక సాయం చేశారు.

డంపింగ్ యార్డు నిర్వహణ పక్కాగా ఉండాలి: కమిషనర్

చిత్తూరు, సెప్టెంబరు 21: నగరపాలక డంపింగ్‌యార్డును పక్కాగా నిర్వహించాలని ప్రజారోగ్యం అధికారులను కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. శనివారం డంపింగ్ యార్డును తనిఖీ చేశారు. అనంతరం మంగసముద్రంలో వ్యర్థాల నిల్వలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. ● స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా గిరింపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుభ్రత, ప్లాస్టిక్ లేని జీవనం అంశాలపై అవగాహన కార్యక్రమానికి కమిషనర్ హాజరయ్యారు. అనంతరం విద్యార్థులు, స్థానికులతో కలిసి గంగినేని చెరువు పార్కు వరకు ర్యాలీ చేపట్టి, పార్కులో శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్, హెచ్ఎం రమేష్‌బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నరసింహ, లోకనాథం, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి పనులు: డ్వామా పీడీ


ఆడిట్ వివరాలను చూస్తున్న రాజశేఖర్

వెదురుకుప్పం, సెప్టెంబరు 21: ఉపాధి హామీ పనులను పారదర్శకంగా నిర్వహించాలని డ్వామా పీడీ ఎస్.రాజశేఖర్ అన్నారు. శనివారం కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయ సముదాయంలో 'సామాజిక తనిఖీ ప్రజావేదిక' కార్యక్రమాన్ని నిర్వహించారు. 17వ విడత సోషల్ ఆడిట్‌లో 980 పనులను తనిఖీ చేశారు. ఈ పనులకు వేతనాల కింద రూ.9కోట్లు, మెటీరియల్ కింద రూ.1.68 కోట్లు విడుదలయ్యాయి. ఈ పనులను తనిఖీ చేయడంతో రికవరీ, జరిమానాల కింద రూ.96987కు ఆదేశించారు. కాగా, సామాజిక తనిఖీ ప్రజావేదికకు కూలీలు, ప్రజలు మొగ్గు చూపకపోవడంతో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. డీవీవో బి.గంగాభవాని, ఏపీడీ టీఎస్ శోభన్‌బాబు, ఇన్‌చార్జి ఎంపీడీవో పి.లక్ష్మీపతి, ఏపీవో జాహ్నవి హాజరయ్యారు.

జీవో 85ను రద్దు చేయాలి: పీహెచ్‌సీ వైద్యులు



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట పీహెచ్‌సీ వైద్యుల నిరసన

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 21: పీజీ విద్యలో రిజర్వేషన్ల కుదింపుపై ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, జీవో 85ను వెంటనే రద్దు చేయాలని ఏపీ పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట పీహెచ్‌సీ డాక్టర్లకు నష్టం కలిగించే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని నల్లబ్యాడ్జీలు నోటికి కట్టుకొని నిరసన తెలిపారు. యూనియన్ నాయకురాలు శిరీష, వైద్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


రెడ్డి రాధాకు చెక్ అందజేస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, సెప్టెంబరు 21: పాలసముద్రం పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తూ అనారోగ్యంతో ఈ ఏడాది జూలై 26వ తేదీన మరణించిన జయప్రకాష్ కుటుంబీకులకు ఎస్పీ మణికంఠ ఆర్థికసాయాన్ని అందించారు. ఆయన భార్య రెడ్డిరాధాకు శనివారం తన కార్యాలయంలో విడో ఫండ్ నుంచి రూ.50వేలు, ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ.25వేల చెక్కులను అందించారు. పోలీసు శాఖ తరపున బెనిఫిట్స్ అన్నీ అందజేస్తామని ఎస్పీ చెప్పారు.

నూతన ఎస్ఐకి సన్మానం


విజయపురంలో ఎస్ఐని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

విజయపురం, సెప్టెంబరు 21: కొత్తగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ బలరామయ్యను మండల టీడీపీ నాయకులు శనివారం విజయపురంలో సన్మానించారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు గుణభూషణమ్మ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కైలాసం యాదవ్, నాయకులు దశరథరాజు, సుధాకర్‌రాజు, మురళి, కపిల్, నారాయణరాజు, అశోక్, బాలాజీ నాయకుడు, హరికృష్ణా, సుధానాయుడు, శివయ్యానాయుడు, వీరరాఘవులు, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అష్టావధానం


అష్టావధానంలో పాల్గొన్న సాహితీవేత్తలు

చిత్తూరు కల్చరల్/సెంట్రల్, సెప్టెంబరు 21: మాతృభాష ఔచిత్యానికి అద్దం పట్టేలా శనివారం హరివిల్లు లలిత కళావేదిక ఆధ్వర్యంలో సంతపేట బృందావన పాఠశాలలో సాహితీవేత్తలు నిర్వహించిన అష్టావధానం అలరించింది. అవధానిగా మల్లెల నాగరాజు, నిషిద్ధాక్షరిగా జె.జగదీశ్, దత్తపదిగా ఆర్.శ్రీనివాసులు, చందోభాషణులుగా చంద్రశేఖర్, ఆశుకవిగా ధర్మరాజ్, సంధానకర్తగా అన్నయ్యనాయుడు, న్యస్తాక్షరిగా బాలకృష్ణమూర్తి, సమస్య ప్రస్తావకులుగా బ్రహ్మానంద్, వర్ణమాలంకృతులుగా ఇ.లత, అప్రస్తుతులుగా ఎర్రయ్య వ్యవహరించి ఆద్యంతం అలరించారు. వి.హరినాయుడు, గంటా మోహన్, మునుస్వామి, భాస్కర్‌రెడ్డి, గోవిందన్ హాజరవగా, వీరందరినీ పాఠశాల యజమాని శైలజాకుమారి దంపతులు సత్కరించారు.

25 తలలతో వినాయక ప్రతిమ



పెనుమూరు, సెప్టెంబరు 21: కలవగుంట గ్రామంలో 25 తలల వినాయక ప్రతిమను ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీపీ హరిబాబునాయుడు ప్రత్యేక పూజల్లో, ఊరేగింపులో పాల్గొన్నారు.

చిత్తూరు రూరల్‌లో నేటినుంచి గ్రామసభలు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 21: చిత్తూరు రూరల్ మండలంలో ఆదివారం నుంచి జరగనున్న గ్రామసభలను విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా కార్యదర్శి జయచంద్రనాయుడు పిలుపునిచ్చారు. శనివారం చిత్తూరు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోని చిత్తూరు ఎమ్మెల్యే చాంబర్‌లో మండల నాయకులతో సమీక్షించారు. సభలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీడీపీ నాయకులు జీవన్, శశికర్‌బాబు, కాశీ, గిరి, రాజేంద్రన్, తులసీపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ అప్పారావు జయంతి

చిత్తూరు సెంట్రల్/వెదురుకుప్పం, సెప్టెంబరు 21: చిత్తూరులోని ఎన్‌పీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో, కార్వేటినగరం, వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో శనివారం గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరస్వామి ఆలయాలు


కరియమాణిక్యస్వామి ఆలయం వద్ద భక్తుల రద్దీ

నగరి, సెప్టెంబరు 21: పెరటాసి నెల తొలి శనివారం కావడంతో వెంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. నగరి పట్టణంలో టీటీడీ ఆధీనంలో ఉన్న శ్రీదేవి,భూదేవి సమేత కరియమాణిక్యస్వామి ఆలయం, సత్రవాడలోని కరివరదరాజస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

భక్తి ప్రపత్తులతో సంకటహర చతుర్థశి

చిత్తూరు కల్చరల్: నగరంలోని 75 దొడ్డిపల్లె సంపద వినాయకస్వామి ఆలయంలో శనివారం సంకటహర చతుర్థశి పూజలను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. పెరటాసి నెల మొదటి శనివారం పూజలూ జరిగాయి.

కాణిపాకంలో ఆకట్టుకున్న అలంకరణలు




కాణిపాకంలో వరసిద్ధి వినాయకస్వామి ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా ఆలయ ధ్వజస్తంభానికి, ప్రధాన ఆలయానికి, సుపథ మండపానికి పుష్పాలంకరణలు




సంకటహర గణపతి వ్రతంలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురుప్రసాద్ - ఆస్థాన మండపంలో వేంకటేశ్వర మహత్యం నాటిక, నృత్యకారిణి విన్యాసం

ప్రజల మంచి కోరేది కూటమి ప్రభుత్వమే : ఎమ్మెల్యే గురజాల

గుడిపాల, సెప్టెంబరు 21: ప్రజల మంచి కోరేది కూటమి ప్రభుత్వమేనని, ప్రజల ఆశీస్సులతో బతికున్నన్నాళ్లూ నారా చంద్రబాబు నాయుడే ముఖ్యమంత్రిగా ఉంటారని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ అన్నారు. శనివారం పాపసముద్రం పంచాయతీ పిళ్ళారికుప్పం గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో వారు ప్రసంగించారు. గుడిపాల మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎంఈవో ఉపేంద్ర, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, జనసేన మండల అధ్యక్షుడు రూప్‌కుమార్, కూటమి నాయకులు బాలాజి నాయుడు, చంద్రమోహన్, హేమాద్రి నాయుడు, అనిల్‌కుమార్, విల్సన్, ఐజాక్, తుమ్మల సాంబశివనాయుడు, అర్జున్, పళని, జగదీశ్వర్‌నాయుడు, మురళీనాయుడు, శివలింగారెడ్డి, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, హరి, బాబు, శంకర్ చౌదరి, గోపి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను పాపసముద్రం వైసీపీ సర్పంచ్ వళ్ళెమ్మ చిట్టిబాబు సత్కరించారు.

నారాయణస్వామీ.. నోరు అదుపులో పెట్టుకో: ఎమ్మెల్యే థామస్

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 21: 'డిప్యూటీ మాజీ సీఎం నారాయణస్వామీ.. నోరు అదుపులో పెట్టుకో.. సీఎం చంద్రబాబును, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను విమర్శించే అర్హత నీకు లేదు' అని జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ హెచ్చరించారు. నెలవాయి గ్రామ పంచాయతీలో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా నెలవాయి వైసీపీ గ్రామ సర్పంచ్ జయలక్ష్మి, క్షీరసముద్రం సర్పంచ్ ఐశ్వర తండ్రి శేఖర్, ఎస్ఆర్‌పురం ఎంపీటీసీ శివయ్య, వైసీపీ సీనియర్ నాయకుడు వెంకటరెడ్డి, వైసీపీ యువ నేత జయకుమార్, చిరంజీవిలు టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్‌నాయుడు ఆధ్వర్యంలో.. ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరారు. జనసేన ఇన్‌చార్జి యుగంధర్, నేతలు శ్రీనివాసులు, కుమార్, బాలాజీ నాయుడు, సూరిరెడ్డి, గురునాథం, సిద్ధయ్యశెట్టి, పుల్లూరు బాబు, విజయశేఖర్ పాల్గొన్నారు.


వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ఎంపీటీసీ, సర్పంచ్‌లతో థామస్

పాలసముద్రం: జీడీనెల్లూరు నియోజక వర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే థామస్ అన్నారు. శనివారం పాలసముద్రం ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఏర్పాటుచేసిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రసంగించారు. డిప్యూటీ మాజీ సీఎం నారాయణస్వామి.. తిరుపతి వెంకన్న లడ్డూల్లో కల్తీ జరగలేదని ప్రభుత్వంపై విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. టీడీపీ నేతలు శేఖర్‌రాజు, రవినాయుడు, బాబునాయుడు, అరుల్‌నాథన్, సాంబశివన్, పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

నింద్ర, సెప్టెంబరు 21: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పాలన అందిస్తోందని తెలుగు యువత మాజీ నేత రమేష్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం అగరం పంచాయతీలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలం మొండివెంగనపల్లె గ్రామ పంచాయతీలో టీఎన్‌టీయూసీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పోటుగారి గంగయ్య ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ చేశారు. టీడీపీ నాయకుడు భాస్కర్, జనసేన మండల యువజన అధ్యక్షుడు కావలి సతీష్, తదితరులు పల్గొన్నారు.

నగరి: మున్సిపాలిటీ పరిధిలోని రెండు, మూడు, నాల్గవ వార్డుల్లో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, డీఈఈ నరేష్‌బాబు, ఏఈఈ రమేష్‌బాబు, టీడీపీ నాయకులు రమేష్‌బాబు, జ్యోతినాయుడు, గుణశేఖర్, ఈఎస్‌శ్రీనివాసన్, మురళినాయుడు, భాస్కర్‌నాయుడు, లోకయ్య, శేఖర్, మదన్‌కుమార్, వెంకటాచలం, ఆకుల అశోక్, గోపి, మణిగండన్ తదితరులు పాల్గొన్నారు.




అగరం, మొండివెంగనపల్లె గ్రామ పంచాయతీలు, నగరిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

వరద బాధితులకు ఆర్థిక సాయం

బంగారుపాళ్యం, సెప్టెంబరు 21: విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండలంలోని ఈశ్వర్‌కళ్యాణ్ అభయ్ ఫౌండేషన్ నిర్వాహకులు ఈశ్వర్ నాయుడు, కళ్యాణ్ రూ.5లక్షలను విరాళమిచ్చారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్‌ను బంగారుపాళ్యం పర్యటనకు వచ్చినప్పుడు మంత్రి నారా లోకేశ్‌కి అందజేశారు.



మంత్రి లోకేశ్‌కి చెక్ అందజేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు, ల్యాబ్ టెక్నీషియన్స్, ఎయిడ్స్ కంట్రోల్ యూనియన్ నాయకులు

వెదురుకుప్పం: సీఎం సహాయనిధికి రూ.లక్ష విరాళాన్ని శనివారం గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్‌కి కార్వేటినగరం ఎస్ఎల్ఎన్ విద్యాసంస్థల అధినేత దిలీప్‌కుమార్ అందించారు. వరద బాధితుల సహాయార్థం ఈ మొత్తం అందించినట్లు చెప్పారు.


ఎమ్మెల్యేకి చెక్ అందిస్తున్న దిలీప్‌కుమార్

చిత్తూరు రూరల్: మంత్రి లోకేశ్‌కి శుక్రవారం రూ.లక్ష చెక్ అందజేసినట్లు ఏపీ శాక్స్ ల్యాబ్ టెక్నీషియన్స్, ఎయిడ్స్ కంట్రోల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు క్రాంతికుమార్, దేవచంద్ర, సుబ్బారావు, జాకీర్ తదితరులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా ఆదికేశవులు దంపతుల జయంతి


డీకే ఆదికేశవులు విగ్రహానికి పూలమాలవేసి, నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గురజాల తదితరులు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 21: దివంగత మాజీ ఎంపీ, టీటీడీ మాజీ చైర్మన్ డీకే ఆదికేశవులు, మాజీ ఎమ్మెల్యే డీఏ సత్యప్రభ దంపతుల జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. మురకంబట్టు సర్కిల్‌లో, సీటమ్స్ కళాశాలలోని ఆదికేశవులు విగ్రహానికి, సత్యప్రభ చిత్రపటానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, డీకే బద్రినారాయణ, మాజీ మేయర్ కటారి, హేమలత పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం గాంధీ సర్కిల్‌లో బలిజ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షుడు ఓఎం రామదాసు, కాణిపాకం ట్రస్ట్ బోర్డు మాజీ డైరెక్టర్ అప్పోజి, మాజీ కార్పొరేటర్ వసంత్ కుమార్, గిరింపేట దుర్గమ్మ గుడి మాజీ చైర్మన్ విశ్వనాథ్, నేతలు కాజూరు బాలాజీ, షణ్ముగం, రాధాకృష్ణ, ఆరణి తులసీరాం, ఆనంద్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీకి ఘన నివాళి



చిత్తూరు సిటీ, సెప్టెంబరు 21: మాజీ ఎంపీ శివప్రసాద్ వర్ధంతి సందర్భంగా టీడీపీ నేతలు ఘన నివాళి అర్పించారు. శనివారం ఐతేపల్లెలోని ఎంపీ సమాధి వద్ద ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, యాదమరి మండల అధ్యక్షుడు మూర్తి, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రటీ, జిల్లా తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి వల్లేరు అమర్‌నాథ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



నింద్ర, సెప్టెంబరు 21: నింద్ర దళితవాడకు చెందిన గురువయ్య శనివారం మృతి చెందాయి. సమాచారం అందుకున్న నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్.. మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, ఆదుకుంటామని చెప్పారు. ఆయనవెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహకం



నగరి, సెప్టెంబరు 21: అంతర్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో చిత్తూరు జట్టు ప్రతిభ చూపిన విషయం తెలిసిందే. నగరి మున్సిపాలిటీ పరిధిలోని నారాయణ ఉన్నత పాఠశాల విద్యార్థులు రక్షణ్, లక్ష్మీనరసింహ ఈ జట్టులో ఉండటంతో వారికి ఆ పాఠశాల యాజమాన్యం శనివారం ప్రోత్సాహకంగా చెక్కులను పంపిణీ చేసింది. డీజీఎం కొండలరావు, ఏజీఎం శ్రీనివాసులు, కిరణ్, కార్తీక్, టీచర్లు పాల్గొన్నారు.

రూ.5లక్షల బాణసంచా స్వాధీనం

బంగారుపాళ్యం, సెప్టెంబరు 21: తగ్గువారిపల్లె పంచాయతీ కొత్తపల్లెకి చెందిన మహేంద్ర తనింట్లో అనుమతుల్లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన రూ.5 లక్షల బాణసంచా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

పెండింగ్ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయండి

పెనుమూరు, సెప్టెంబరు 21: ప్రభుత్వం మంజూరుచేసిన ఇళ్లలో అసంపూర్తిగా ఉన్నవాటిని పూర్తి చేయాలని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం రామకృష్ణాపురం పంచాయతీ కార్తికేయపురంలో మన ఇళ్లు మన గౌరవం కార్యక్రమం నిర్వహించారు. ఏఈ యోగమూర్తినాయుడు, ఏపీవో గుణశేఖర్, సెక్రటరీ సునీత, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మురగయ్య, సర్పంచ్ వెంకటేష్ పాల్గొన్నారు.

తిరుమలను అపవిత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి: టీడీపీ


తవణంపల్లెలో జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

తవణంపల్లె, సెప్టెంబరు 21: కల్తీ నెయ్యితో ప్రసాదాలు తయారు చేసి తిరుమల పవిత్రతను అపవిత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం తవణంపల్లెలోని టీ.పుత్తూరు రోడ్డు వద్ద మాజీ సీఎం జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు గాలి దిలీప్, మాజీ జడ్పీటీసీలు వెంకటేష్‌చౌదరి, కోదండయ్య, నాయకులు శరవణ, గోపియాదవ్, ధనంజయనాయుడు, వేలు, జ్యోతి పాల్గొన్నారు.

వెంకన్నకే పంగనామాలు పెట్టిన జగన్: సీఆర్ రాజన్

గుడిపాల: వెంకన్నకే పంగనామాలు పెట్టిన ఘనత మాజీ సీఎం జగన్‌కు దక్కుతుందని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ మండిపడ్డారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జగన్ పాపాలు పండాయని చెప్పుకొచ్చారు. నాయకులు గోవింద గౌడ్, ఆరుముగం, జయచంద్ర, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందమాల భక్తులకు అన్నదానం

నగరి, సెప్టెంబరు 21: నగరి మున్సిపాలిటీ పరిధిలోని ఓంశక్తి ఆలయంలో శనివారం కృష్ణహోటల్ యజమాని తులసిబాబు సౌజన్యంతో గోవిందమాల భక్తులకు అన్నదానం చేశారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు జ్యోతినాయుడు తెలిపారు.

దేవరెద్దుకు పూజలు

గుడిపాల, సెప్టెంబరు 21: ఏఎల్‌పురం గ్రామంలో దేవరెద్దుకు శనివారం మొదటి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడ ఉన్న దేవరెద్దు మృతిచెందడంతో కొత్తగా దేవరెద్దును వేదగిరి వంశస్తులు తీసుకొచ్చి పురోహితుడు మహేష్ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేయించారు. మధ్యాహ్నం అన్నదానం చేయగా, రాత్రి పిల్లాంగట్టి నృత్యాల మధ్య పురవీధుల్లో ఊరేగించారు. జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకుడు చెన్నకేశవులు నాయుడు, సర్పంచ్ గుర్రప్ప నాయుడు, మాజీ సర్పంచ్ సుబ్బా నాయుడు, రమేష్ నాయుడు, ఏఎల్‌పురం పాఠశాల హెచ్ఎం కళావతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం

యాదమరి, సెప్టెంబరు 21: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనివారం స్థానిక ఐవోసీఎల్ సంస్థ కార్యాలయంలో కె.గొల్లపల్లె పాఠశాల విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా తెలియజేశారు. హెచ్ఎం లలిత, ఐవోసీఎల్ డీజీఎం అమితాబ్ సర్దార్, దీపక్ షణ్ముఖ్, టీచర్లు పాల్గొన్నారు.

26న వ్యాసరచన పోటీలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 21: సత్యసాయి బాబా శతజయంత్యుత్సవాల్లో భాగంగా ఈనెల 26న జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. శనివారం గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో దీనికిసంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సేవాసమితి జిల్లా అధ్యక్షుడు మధుసూదనం, నగర కన్వీనర్ ఆర్.శేషనారాయణ, వసంత, గజేంద్రరెడ్డి, శంకర్, దేవరాజు, అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

నగరి, సెప్టెంబరు 21: నగరి పట్టణ పరిధిలోని సత్రవాడలో శనివారం నిర్వహించిన పోలీసుల దాడిలో సారా అమ్ముతున్న గోపిని పోలీసులు అరెస్టు చేశారు. ఐదు లీటర్ల సారా పొట్లాలను అమ్ముతుండగా పట్టుకుని కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు. అలాగే 2014లో తప్పిపోయిన అంజనయ్యను పట్టుకుని మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ రవికుమార్ ముందు శనివారం సాయంత్రం హాజరు పరిచినట్లు సీఐ పేర్కొన్నారు.

ఎస్ఐకి సత్కారం



వెదురుకుప్పం, సెప్టెంబరు 21: వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్యను శనివారం ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రికుమార్ సత్కరించారు. ఆయనవెంట బీజేపీ మండలాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి ఉన్నారు.


80శాతం సబ్సిడీతో ఉలవల పంపిణీ

బంగారుపాళ్యం, సెప్టెంబరు 21: రైతులకు 80 శాతం సబ్సిడీతో ఉలవలను రైతులకు శనివారం గుంతూరు రైతు భరోసా కేంద్రం వద్ద టీడీపీ మండల అధ్యక్షుడు జయప్రకాష్ పంపిణీ చేశారు. రైతులు కిలో రూ.7చెల్లించాల్సి ఉందని ఏవో చిట్టిబాబు తెలిపారు. సర్పంచ్ కోకా ప్రకాష్‌నాయుడు, ఆర్‌బీకే సిబ్బంది హరీష్, విజయకుమార్‌రెడ్డి, సాదరయ్య పాల్గొన్నారు.

'మొగిలి' మృతురాలి కుటుంబానికి పరిహారం

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 21: బంగారుపాళ్యం మండలం మొగిలిఘాట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగాధరనెల్లూరు మండలం పాపిరెడ్డిపల్లెకు చెందిన పద్మావతి వేలూరు సీఎంసీలో చికిత్సపొందుతూ మృతిచెందిన విషయం తెలిసిందే. ఆమె కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్‌ను శనివారం సాయంత్రం స్థానిక నేతలతో కలిసి పద్మావతి భర్త భాస్కర్‌రెడ్డికి ఎమ్మెల్యే థామస్ అందజేశారు. టీడీపీ నేతలు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, విజయకుమార్‌రెడ్డి, యాగమరెడ్డి, గిరిబాబురెడ్డి, రుషేంద్రరెడ్డి, దేవరాజులు, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా థామస్ కుమారుడి పుట్టిన రోజు వేడుకలు


వేడుకల్లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే థామస్

జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ కుమారుడు రాహుల్ పుట్టిన రోజు వేడుకలను శనివారం రాత్రి కోటాగరం పంచాయతీ ఎట్టేరి గ్రామంలో టీడీపీ యువనేత హరీష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, గంగాధరనెల్లూరు, చిత్తూరు, చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు డాక్టర్ థామస్, గురజాల జగన్‌మోహన్, పులివర్తినాని, మురళీమోహన్, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్‌రాజన్, జనసేన, బీజేపీ నాయకులు హాజరయ్యారు.